సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 6 । ఆగస్టు । 2024

అనంతగిరిలో.. జలసిరి



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మిడ్ మానేరు ద్వారా అంతగిరి (అన్నపూర్ణ) రిజర్వాయర్‌కు గోదావరి నీటిని అధికారులు వదిలారు. దీంతో సిద్దిపేట జిల్లాలోని రంగనాయక, మల్లన్న, కొండ పోచమ్మసాగర్ రిజర్వాయర్లకు మంగళవారం నుంచి గోదారి నీటిని పంపింగ్ చేయనున్నారు. గోదావరి జలాలతో అంతగిరి పరవశించింది. జిల్లా రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. -సిద్దిపేట జోన్

న్యూస్‌రీల్

నేడు మంత్రి పర్యటన

హుస్నాబాద్: నియోజకవర్గంలో మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు హుస్నాబాద్ పట్టణంలోని కొత్త చెరువు వద్ద స్వచ్ఛదనం పచ్చదనంలో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో వీరభద్రస్వామి నక్షత్ర దీక్ష స్వీకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద జేఏసీ, అఖిల పక్షం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, ప్రజాగాయకుడు గద్దర్, జయరోద్దీన్ అలీఖాన్ వర్ధంతిలో ప్రభాకర్ పాల్గొంటారు.

బీజేపీ నిరసన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: కాంగ్రెస్ పార్టీ గడిచిన అసెంబ్లీ ఎన్నికలో చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్‌పై ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంబేడ్కర్ అభయ హస్తం కింద ప్రతి కుటుంబానికీ రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో దాని ప్రస్తావించకుండా ఎస్సీలను మోసం చేసిందన్నారు. ప్రతి ఎస్సీ కుటుంబానికి శాశ్వత ఇల్లు నిర్మాణానికి రూ.6 లక్షలివ్వాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువత ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, నాయకులు కిశోర్, రాంప్రసాద్, కిష్టయ్య, అరుణ్ కుమార్, నరేశ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

సీఎం వ్యాఖ్యలు సరికాదు

ట్రస్మా జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముఖ్యమంత్రి రేవంత్, ప్రైవేట్ విద్యాసంస్థలను కించపరిచేలా మాట్లాడటం సరికాదని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గజ్జల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా ట్రస్మా కమిటీ నిర్వహించిన సమావేశంలో సంజీవరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ప్రైవేట్ పాఠశాలల్లో అధికంగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఇదే ప్రైవేట్ విద్యాలయాలపై విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఉన్న నమ్మకం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారని, ప్రైవేట్ విద్యాసంస్థలకు కమర్షియల్ నుంచి డొమెస్టిక్‌కు మార్చాలన్నారు. సమావేశంలో హరినాథ్, సంతోశ్‌కుమార్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో క్లస్టర్ టోర్నీకి సన్నాహం



వర్గల్ నవోదయ స్టేడియం ట్రాక్ పనులకు మార్కింగ్ వేస్తున్న దృశ్యం

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ నవోదయలో రెండు రోజుల క్లస్టర్ లెవెల్ టోర్నీకి సన్నాహం మొదలైంది. బుధవారం నుంచి రెండు రోజులపాటు ఇక్కడే తెలంగాణలోని వివిధ నవోదయ విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు క్రీడా స్టేడియంలో లైన్ మార్కింగ్, జెండాలు పాతడం, పిచ్చిమొక్కల తొలగింపు తదితర పనులు వ్యాయామోపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. క్రీడాకారులకు, వెంట వచ్చే ఉపాధ్యాయులకు వసతి కోసం తగు ఏర్పాట్లు చేస్తున్నామని, మంగళవారం సాయంత్రం వరకు గ్రౌండ్ సిద్ధమవుతుందని పేర్కొన్నారు.

ఆలస్యం.. ఉపశమనం

- గత జీపీ, జెడ్పీ ఎన్నికల ఖర్చు వివరాలివ్వని అభ్యర్థులకు..
- 2021 నుంచి మూడేళ్లు పోటీకి అనర్హులుగా ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,504 మందిపై నిషేధం
- 2024 ఫిబ్రవరితో ముగిసిన అనర్హత సమయం

అనర్హులుగా ప్రకటించిన అభ్యర్థుల వివరాలు

జిల్లా పేరు	వార్డు సభ్యుడు	సర్పంచ్‌లు	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు
సంగారెడ్డి	475	59	48	13
మెదక్	149	11	14	03
సిద్దిపేట	602	60	65	05



సాక్షి, సిద్దిపేట: గ్రామ పంచాయతీ(జీపీ), పరిషత్తు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం ఎదుర్కొంటున్న అభ్యర్థులకు ఎన్నికల ఆలస్యమవుతుండటంతో కలిసొచ్చింది. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలు అప్పగించకపోవడంతో 1,504 మంది అభ్యర్థులపై రాష్ట్ర ఎన్నికల సంఘం నిషేధం విధించింది. మూడేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయకుండా విధించిన నిషేధ కాలపరిమితి.. ఎన్నికలు ఆలస్యం అవుతుండంతో ఊరట ఇచ్చినట్లయింది. దీంతో వీరికి మళ్లీ పోటీ చేసే అవకాశం రానుంది. పంచాయతీ పాలకవర్గాల కాలపరిమితి ఫిబ్రవరి 2తో ముగిసింది. స్థానిక సంస్థలు జూలై 4తో పదవీ కాలం ముగిసింది. త్వరలో గ్రామ పంచాయతీ నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించడంతో అనర్హత వేటు పడిన అభ్యర్థులపై ఆంక్షలు తొలగిపోనున్నాయి.

లెక్కలు అప్పగించకపోవడంతో తిప్పలు

పంచాయతీరాజ్ చట్టం -2018 ప్రకారం 2019లో ఉమ్మడి మెదక్ జిల్లాలో మూడు విడతలుగా 6,036 వార్డు మెంబర్‌లు, 1,615 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 2019 ఏప్రిల్, మే నెలల్లో ఎంపీటీసీలకు 713, జెడ్పీటీసీలు 68 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఆయా పదవుల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికలు జరిగిన 45 రోజుల లోపు ఓడిన, గెలిచిన అభ్యర్థుల ఖర్చుల వివరాలను నిర్దేశిత నమూనాలో ఆయా ఎంపీడీఓలకు లెక్కలు సమర్పించాలి. ఎన్నికల నిబంధనలపై అవగాహన లేని వారు అప్పగించలేదు. మరికొందరు ఓడిపోయామని నిర్లక్ష్యం చేశారు. అభ్యర్థులు సమర్పించిన వివరాల ఆధారంగా ఎన్నికల సంఘం 2021లో వారిపై అనర్హత విధించింది. ఉత్తర్వులు జారీ అయిన తేదీ నుంచి మూడేళ్ల వరకు పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించారు.

చిగురించిన ఆశలు

సర్పంచ్, వార్డు మెంబర్‌ల పదవీ కాలం ఫిబ్రవరి 2తో ముగిసింది. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ఒక వేళ గడువులోగా సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు ఎన్నికలు జరిగితే గతంలో వేటుపడిన అభ్యర్థులు చాలా మంది పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయేవారు. 2021 నుంచి మూడేళ్లు ప్రకటించగా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఫిబ్రవరి 2024తో అనర్హత సమయం ముగిసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,504 మంది అభ్యర్థులను అనర్హులుగా పోటీ అనర్హులుగా ప్రకటించారు. అందులో వార్డు మెంబర్‌గా పోటీ చేసిన వారు 1,226, సర్పంచ్ 130, ఎంపీటీసీలు 127, జెడ్పీటీసీలు 21 మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా వేటు పడిన అభ్యర్థుల ఆశలు చిగురించాయి. ఎన్నికల్లో పోటీ చేయడానికి చట్టపరమైన అడ్డంకులు తొలగిపోయాయి.

వారందరూ అర్హులే



పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లో ఖర్చుల వివరాలను స్థానిక ఎంపీడీఓలకు అప్పగించాలి. అలా చేయనందు వల్ల అనర్హులుగా ఎన్నికల సంఘం ప్రకటించింది. ఉత్తర్వులు జారీ అయినప్పటి నుంచి మూడేళ్ల వరకు నిషేధం ఉంటుంది. ఈ గడువు కాలం ముగియడంతో పోటీకి అందరూ అర్హులు కానున్నారు.

-దేవకీ దేవి, డీపీఓ, సిద్దిపేట

స్వచ్ఛత అందరి బాధ్యత

కలెక్టర్ మనుచౌదరి



మర్కూక్(గజ్వేల్): పాములపర్తిలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

మర్కూక్(గజ్వేల్): స్వచ్ఛత మన అందరి బాధ్యత అని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం మండలంలో ఉన్న పాములపర్తిలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఆయన.. స్వచ్ఛదనం పచ్చదనం ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. స్వచ్ఛదనం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతీ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. తాగు నీటి కలుషితం వల్ల వివిధ వ్యాధులొస్తాయన్నారు. ప్రజలు బయటకు వెళ్లినప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్జల్, ఏపీఎం బ్రహ్మచారి, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: ప్రజలకు విక్రయించే కూరగాయలు, మాంస విషయంలో తాజా నాణ్యమైన వాటిని విక్రయించేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. సోమవారం స్థానిక ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో ఉన్న వసతులపై ఆరా తీశారు. రైతులు, ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో పారిశుద్ధ్య నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇర్కోడ్ స్లాటర్ హౌస్‌పై కూడా ఆరా తీశారు. మార్కెట్ పరిసరాల్లో వర్షా కాల నేపథ్యంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నాన్ వెజ్ మార్కెట్‌లో తాజా మాంసం విక్రయాలు జరిగేలా చూడాలని, సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతతో ఆరోగ్యం

కొండపాక(గజ్వేల్): పచ్చదనం పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ పేర్కొన్నారు. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లిలో 'స్వచ్ఛదనం-పచ్చదనం' సోమవారం ప్రారంభించారు. కార్యక్రమ నిర్వహణలో భాగంగా గ్రామంలో పర్యటించి మురుగు కాలువల నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, పరిసరాల పరిశుభ్రతలను పరిశీలిస్తూ ప్రజలకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గరీమా అగర్వాల్ మాట్లాడారు. పచ్చదనం పరిశుభ్రతలను పాటించడం వల్ల గ్రామాలు అందంగా తయారు అవుతాయన్నారు. విద్యార్థులను హైస్కూల్లో పలు సబ్జెక్టుల్లో అంశాలపై ప్రశ్నలు అడుగుతూ సమాధానాలు రాబట్టారు. అనంతరం హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీపీఓ దేవకీదేవి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, గ్రామ ప్రత్యేకాధికారి ప్రియదర్శినీ, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భావితరాలకు మనుగడ..

చిన్నకోడూరు(సిద్దిపేట): చెట్లతోనే భావితరాలకు మనుగడ అని, ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా సోమవారం చిన్నకోడూరు, పెద్దకోడూరు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, ఎంపీఓ సోమిరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

పల్లెలు పచ్చదనంతో నిండాలి

హుస్నాబాద్‌రూరల్: పల్లెలు స్వచ్ఛదనం పచ్చదనంతో నిండాలని జెడ్పీ సీఈఓ రమేశ్ అన్నారు. సోమవారం పొట్లపల్లి, నాగారం గ్రామాల్లో చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు గ్రామ కమిటీల సహకారం పల్లెలను పచ్చగా మార్చడానికి పని చేయాలని సూచించారు. స్వచ్ఛత వీధు ల్లో కలియ తిరిగి మురుగు కాల్వలు, రోడ్లపై చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న భూ నిర్వాసితులు, సీపీఐ నాయకులు

భూనిర్వాసితులను ఆదుకోవాలి

కలెక్టరేట్ ఎదుట బాధితుల నిరసన

సిద్దిపేటరూరల్: మల్లన్నసాగర్ ముంపు గ్రామాల బాధితుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రావాల్సిన పూర్తి పరిహారాన్ని అందించి భూనిర్వాసితులను ఆదుకోవాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ అన్నారు. సోమవారం ముంపు గ్రామాల ప్రజలకు రావాల్సిన పరిహారం అందించాలని పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ మాట్లాడారు. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి ఆరేళ్లు పూర్తయినా ముంపునకు గురైన గ్రామాల నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం ఇప్పటి వరకు అందలేదన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఒంటరి మహిళలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రిజిస్ట్రేషన్, 18 సంవత్సరాలు పైబడిన యువతకు ప్యాకేజీ , ప్లాట్ రిజిస్ట్రేషన్, కొన్ని అసైన్డ్ భూముల పరిహారాలు కూడా గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లించలేదన్నారు. దీని కోసం 6 సంవత్సరాల నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నో దరఖాస్తులు ఇచ్చినప్పటికీ ఈ సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం వెంటనే నిర్వాసితుల పరిహారాలను అందించాలని, లేనిపక్షంలో నిర్వాసితులను ఏకం చేసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నారాయణఖేడ్: ప్రతీనెల పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఖేడ్ ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సును నడపనున్నట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 19న పౌర్ణమిని పురస్కరించుకుని 17వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఖేడ్ నుంచి ప్రత్యేకబస్సు బయలుదేరుతుందన్నారు. 18న కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్‌లో దర్శనం చేయించుకుని.. 19న అరుణాచలానికి చేరుకొని గిరి ప్రదక్షిణ చేయించడం జరుగుతుందన్నారు. సాయంత్రం అక్కడి నుంచి తిరుగు ప్రయాణమై 20న జోగులాంబ శక్తిపీఠాన్ని దర్శించుకుని అదేరోజు సాయంత్రం ఖేడ్‌కు బస్సు చేరుకుంటుందని వివరించారు. ఒక్కొక్కరికి రానుపోను రూ.4500 ఛార్జి ఉంటుందన్నారు. ముందుగానే భక్తులు బుకింగ్ చేసుకోవాలన్నారు.

ప్రజావాణికి 50 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రజల నుంచి 50 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని..

విశ్వబ్రాహ్మణులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందించారు. వెయ్యి కోట్లతో తెలంగాణ విశ్వబ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన విశ్వబ్రాహ్మణులకు రూ. 5 వేల పెన్షన్ అందించాలన్నారు. పుస్తెమట్టెలను కార్పొరేట్ జ్యువెలరీ షాపుల్లో విక్రయించకుండా చూడాలన్నారు. తమకు నామినేటెడ్ పదవులతోపాటుగా శాసనసభల్లో సీట్లు కేటాయించాలన్నారు. తమ కుటీర పరిశ్రమలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు.

మంచం పట్టిన పెద్దతండా

- విజృంభిస్తున్న విషజ్వరాలు
- ఊరంతా ఫీవర్
- ఒక్కో ఇంట్లో ఇద్దరు బాధితులు
- స్థానికంగా వైద్యం అందక ప్రైవేటు దవాఖానాలకు పరుగు
- పట్టించుకోని ఆరోగ్యవైద్య సిబ్బంది



పంచాయతీ కార్యాలయం సమీపాన కంపుకొడుతున్న డ్రైనేజీ



పెద్దతండాలో జ్వరం బారిన పడిన విజయ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పెద్దతండా గ్రామంలో పది రోజులుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామస్తులంతా టైఫాయిడ్, రక్తకణాలు, ఒళ్లు నొప్పి తదితరాలతో మంచం పట్టారు. ప్రతి ఇంటికి ఇద్దరు చొప్పున జ్వరాలు, నొప్పులతో బాధపడుతున్నారు. కొందరి పరిస్థితి విషయంగా ఉండటంతో వైద్యం కోసం హుస్నాబాద్, కరీంనగర్, ముల్కనూర్ తదితర పట్టణాలకు తరలిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలో జ్వరాలు వ్యాప్తి చెందాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఆరోగ్య ఉపకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పెద్దతండా గ్రామానికి విషజ్వరాలు వ్యాప్తి రోజురోజుకూ పెరుగుతోంది. పది రోజుల కిందట పందుల సంఖ్యలో జ్వర బాధితులు ఉండగా నేడు వందల మందికి జ్వరాలు రావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి జ్వరాలు తీవ్రంగా బాధ పెడుతుండటంతో వారు పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ దవాఖానాలకు చేరుతున్నారు. కొందరికి జ్వరం రాగానే కాళ్లు, చేతులు, కీళ్లు పట్టుకొని మంచాల నుంచి కదల్లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జ్వరాలు తగ్గినా నొప్పులు తగ్గడం లేదని బాధపడుతున్నారు. కూతవేటు దూరంలో ఆరోగ్య ఉప కేంద్రం ఉన్నా వైద్యులు సకాలంలో తమకు వైద్యం అందించలేక పోతున్నారని పలువురు రోగులు వాపోతున్నారు. ప్రైవేట్ దవాఖానాలకు వెళితే లక్షలు ఖర్చు అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంత డబ్బులు పెట్టే స్తోమత లేక ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నామని చెప్పారు.

పడకేసిన పారిశుద్ధ్యం

గ్రామంలో జ్వరాలు ప్రబలడానికి పారిశుద్ధ్య లోపమేనని పలువురు ఆరోపిస్తున్నారు. వీధులు మురికి కూపాలను తలపిస్తున్నాయి. ఇళ్ల ముందే అపరిశుభ్రత నెలకొంది. డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకొని పోయింది. మండల అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా చాలా గ్రామాల్లో పారిశుద్ధ్యం అటకెక్కింది. మురుగుకాలువల్లో నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది.

పట్టించుకోని వైద్యారోగ్య శాఖ

కూత వేటులో ఆరోగ్య ఉప కేంద్రం ఉంది. అక్కడ వైద్య సిబ్బంది ఉండి కూడా విషజ్వరాలు వ్యాప్తి చెంది ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్న పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొందరికి విషజ్వరాల నుంచి డెంగీగా మారి రక్తంలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోతున్నాయని, తగ్గే వరకు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి రక్తనమునాలను సేకరించాలని వారు కోరుతున్నారు.


పారిశుద్ధ్య లోపంతోనే..



నాకు మూడు రోజులుగా జ్వరం. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడంతో ఒకే వీధిలో పదుల సంఖ్యలో విషజ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. జ్వరం తగ్గకపోవడంతో ప్రైవేట్ దవాఖానాకు వెళ్లి రక్త పరీక్షలు చేయిస్తే రక్తకణాలు తగ్గుతున్నాయని చెప్పారు. పలుమార్లు వైద్యసిబ్బందికి గ్రామంలో విషజ్వరాలు వస్తున్నాయని చెప్పిన పట్టించుకోవడం లేదు.

– గుగులోతు రాంబాబు, పెద్దతండా గ్రామం

తీవ్ర జ్వరంతో లేవలేకున్నా..



పది రోజులుగా తీవ్ర జ్వరంతో మంచానికే పరిమితమై లేవలేకున్నా. మందులిచ్చే వారు తండాకు రావడం లేదు. నా కొడుకు ఇటీవల జ్వరం తగ్గకపోవడంతో ప్రైవేట్ దవాఖానాకు తీసుకెళ్లి పరీక్షలు చేయించాడు. వైద్యులు.. టైఫాయిడ్ వచ్చిందన్నారు.

– గుగులోతు పుల్యానాయక్, పెద్దతండా



డీపీఓ దేవకీదేవికి సమ్మె నోటీసు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు కొమురయ్య

జీపీ కార్మికుల సమ్మె నోటీసు

కొండపాక(గజ్వేల్): పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సోమవారం జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బర్మ కొమురయ్య, డీపీఓ దేవకీదేవికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ, కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. జీఓ 51ని సవరించి పాత పద్ధతి ప్రకారం కార్మికులను కొనసాగించేలా చూడాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8న సమ్మె కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. సమ్మెకు సంబంధించిన నోటీసును అందజేశామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న స్వామి

సిద్దిపేటఅర్బన్: మండలంలోని మిట్టపల్లిలో గల సురభి మెడికల్ కళాశాల విద్యార్థులకు నూతనంగా అమలులోకి వచ్చిన నేర చట్టాలపై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. 'కొత్త న్యాయ చట్టాలు.. కొత్త సవాళ్లు' అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు అడ్వకేట్ ఎం.వి స్వామి భారతదేశంలో నేర శిక్ష చట్టాల గురించి వివరించారు. ఉస్మానియా ఫోరెన్సిక్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ రమణ మూర్తి వైద్య విద్యార్థులకు ఫోరెన్సిక్ మెడిసిన్ మీద అవగాహన కల్పించారు. ఫోరెన్సిక్ మెడిసిన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల డీన్ మహమ్మద్ రఫీ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రమణకుమార్, సూపరింటెండెంట్ శివరామ చారి, ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్ఓడీ లక్ష్మణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శృతి, పీఆర్వో పరుశరాములు, పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలపై వినతి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గజ్వేల్: ఉపాధిహామీ కూలీల హక్కులను పరిరక్షించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్ కుమార్‌సింగ్‌ను కోరినట్లు దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పీ.శంకర్ తెలిపారు. సోమవారం ఢిల్లీ నుంచి ఫోన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీలోని కృషి భవన్‌లో తనతోపాటు 15 మంది దళిత, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధుల బృందం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిని కలిసి ఉపాధిహామీ కూలీల సమస్యలపై వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రధానంగా తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల్లో రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని, గతంలో మాదిరిగా రాష్ట్రాలకు కార్పస్ నిధులు ఇస్తే వేతనాలు పెండింగ్‌లో పడకుండా ఉంటాయని కూడా కోరామన్నారు. కూలీల పని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి గ్రామ పంచాయతీలో రసీదు ఇవ్వాలని, ఉపాధిహామీ చట్టానికి విరుద్ధంగా దేశవ్యాప్తంగా తొలగించిన 8.7 కోట్ల జాబ్ కార్డులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయగా.. శైలేష్‌కుమార్ సింగ్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్, ఆర్ఐని సస్పెండ్ చేయాలి

కలెక్టర్‌కు మాచిరెడ్డిపల్లి రైతుల ఫిర్యాదు



ఫిర్యాదు అందజేస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వకుండా తాము పొజిషన్‌లో లేమని తప్పుడు నివేదిక ఇచ్చిన కోహీర్ తహసీల్దార్ బాల శంకర్, ఆర్ఐ సత్యనారాయణపై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని మాచిరెడ్డిపల్లి రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ ఆధ్వర్యంలో రైతులు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సూపరింటెండెంట్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. మాచిరెడ్డిపల్లి గ్రామంలోని 81 సర్వే నంబర్‌లో దళితుల భూములు ఉండగా సంవత్సరాల తరబడి పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. ధరణి వచ్చినప్పటి నుంచి వారికి పట్టాపాస్ పుస్తకాలు రాలేదని, పాస్‌బుక్ కోసం రైతులు దరఖాస్తు చేసుకొని ఇంత వరకు రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రైతులు 81 సర్వే నంబర్ భూముల్లో అన్ని రకాల పంటలను సాగు చేస్తుండగా.. ఎలాంటి పంటలు వేయలేదని తహసీల్దార్ తప్పుడు నివేదిక ఇచ్చారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి తహసీల్దార్, ఆర్ఐలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు బిచ్చన్న, రవి, మమత, శ్రీనివాస్, శాంతమ్మ పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ రైడ్

జిల్లాలో పెరిగిన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం



- కాలుష్య రహిత.. ఖర్చు మితం
- రకరకాల స్కూటీలు, బైక్‌లు అందుబాటులో..
- రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా బయటికి
- తగ్గిన పెట్రోల్ బాధలు

జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం భారీగా పెరిగింది. ప్రతీ పది మందిలో ముగ్గురి నుంచి నలుగురు ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటీలనే కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కార్ల వాడకం సైతం క్రమంగా పెరుగుతోంది. ధరను బట్టి స్కూటీలు, బైక్‌ల విక్రయాలు జరుగుతున్నాయి. వంద కిలో మీటర్ల స్పీడ్‌తో దూసుకెళ్లే బైక్‌లకు ఒక ధర ఉండగా, 30 నుంచి 40 కిలో మీటర్ల స్పీడ్‌లో వెళ్లే స్కూటీలకు మరో ధర పలుకుతుంది. వీటిలో కొన్ని వాహనాలకు రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ అవసరం ఉండగా మరికొన్నింటికి ఎలాంటి రిజిస్ట్రేషన్లు అవసరం లేదు.

– మెదక్‌జోన్

మెదక్ జిల్లా కేంద్రంతో పాటు నర్సాపూర్, తూప్రాన్ తదితర ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహన షోరూములు జోరుగా వెలిశాయి. నియంత్రణ లేకుండా పెరుగుతున్న పెట్రోల్ ధరను అధిగమించేందుకు కొత్తగా కొనుగోలు చేసే వాహన దారులు ఎలక్ట్రిక్ వాహనాలను కొంటున్నారు. డబ్బుల ఆదాతో పాటు జీరో పొల్యూషన్ ఉంటుంది. ఈ వాహనానికి కేంద్ర ప్రభుత్వం సైతం ధరలో సబ్సిడీలు ఇవ్వడంతో వాహనదారులకు తక్కువ ధరకు లభించటంతో ఈ-వాహనాల వైపు వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు.

ఈ స్కూటీతో భారీ ఆదా

పెట్రోల్ స్కూటీతో పోల్చుకుంటే ఈ స్కూటీ కొనుగోలు చేస్తే భారీగా ఆదా చేసుకోవచ్చు. ప్రస్తుతం మార్కెట్‌లో పెట్రోల్ స్కూటీ, ఈ స్కూటీ ధరలు రూ. 90 వేలు ఉంది. పెట్రోల్ స్కూటీ లీటర్ పెట్రోల్‌కు రూ.40 కిలోమీటర్లు మైలేజ్ ఇస్తోంది. 1 లీటర్ పెట్రోల్ ధర ప్రస్తుతం రూ.110 ఉంది. రోజుకూ లీటర్ పెట్రోల్ చొప్పున ఏడాదికి 365 లీటర్ల పెట్రోల్‌కు గానూ రూ. 43,800 అవుతుంది. 3 సంవత్సరాలకు రూ.1,31,400 స్కూటర్ ధరతో కలిపితే మొత్తం స్కూటీపై తిరిగితే రూ.2,21,000 ఖర్చు అవుతుంది.

80 కిలో మీటర్లు ప్రయాణం

అదే ఎలక్ట్రిక్ స్కూటర్ ధర రూ. 90 వేలు దీనికి రోజుకు 2 యూనిట్ల కరెంట్ ఖర్చు అవుతుంది. యూనిట్ పవర్ ధర రూ. 5 చొప్పున రోజుకు రూ.10 ఖర్చు అవుతుంది. దీంతో 80 కిలో మీటర్ల దూరం ప్రయాణం చేయొచ్చు. ఏడాదికి కరెంట్‌కు 365 యూనిట్లకు రూ.3,650 అదే మూడేళ్లకు కరెంట్‌కు అయ్యే ఖర్చు 10,950 మాత్రమే. అలాగే స్కూటీ ధర రూ. 90 వేలు కలిపితే మూడేళ్లకు రూ.1,00,950 మాత్రమే ఖర్చు అవుతోంది. పెట్రోల్ స్కూటీతో పోల్చితే రూ.1,20,450 ఎలక్ట్రిక్ స్కూటీ ద్వారా ఆదా అవుతుంది. అదేవిధంగా బైక్‌లు, కార్లకు సైతం అదే విధంగా ఆదా అవుతుంది.

స్పీడ్ తక్కువ స్కూటీలకు 'నో' రిజిస్ట్రేషన్

గంటకు 50 కిలో మీటర్లలోపు స్పీడ్‌తో వెళ్లే స్కూటీలకు ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు, డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదు, 50 కిలో మీటర్లకు పైగా 100/120 కిలో మీటర్ల స్పీడ్‌తో దూసుకెళ్లే స్కూటీలకు, బైక్‌లకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్‌తోపాటు అన్ని రకాల నిబంధనలు వర్తిస్తాయి. ఎలక్ట్రిక్ బైక్‌లు వాటి స్పీడ్‌ను బట్టి రూ.1.30 లక్షల నుంచి రూ. 1.50 లక్షల వరకు మార్కెట్లో ధర పలుకుతుందని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు.



మెదక్‌లోని ఓ షోరూంలో ఎలక్ట్రానిక్ స్కూటీలు

"పైసా ఖర్చు లేకుండా తిరుగుతున్నా...




ఆరుమాసాల కిందట ఎలక్ట్రిక్ స్కూటర్‌ను రూ.70 వేలకు కొనుగోలు చేశాను. నిత్యం 70 నుంచి 80 కిలోమీటర్లు తిరుగుతున్నాను. రాత్రివేళలో కరెంట్ చార్జింగ్ పెట్టుకొని ఉదయం పైసా ఖర్చులేకుండా తిరుగుతున్నాను. గతంలో నాకు పెట్రోల్ బైక్ ఉండే దాంట్లో నిత్యం రూ.110 చెల్లించి లీటర్ పెట్రోల్ పోసేవాడిని, ఇప్పుడు ఆ డబ్బులు మిగిలిపోతున్నాయ్. అంతే కాకుండా దీనికి డ్రైవింగ్ లైసెన్స్ లేదు, రిజిస్ట్రేషన్ సైతం లేదు."

– మోహన్, బూర్గుపల్లి, ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు దారుడు

సబ్సిడీ అందిస్తున్న కేంద్రం

ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటీలు, కార్లు కొనుగోలు చేసే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ నజరాన ఇస్తోంది. స్కూటీలు, బైక్‌లకు ఒక్కో వాహనం కొనుగోలు చేస్తే కొనుగోలు దారుడికి రూ.20 వేల నుంచి రూ. 25 వేల వరకు సబ్సిడీని కేంద్రం అందిస్తోంది. పెట్రోల్ వినియోగం ఎంత తగ్గితే అంత పొల్యూషన్ తగ్గడంతోపాటు ఖర్చులు తగ్గించి ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ప్రభుత్వం లక్ష్యం.



రంగనాయక.. రమణీయం

ఉన్నట్టుంటి ఒక్కసారిగా రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ను సాయంత్రం వేళ మబ్బులన్నీ కమ్ముకున్నాయి. ఓ దీవిలాగా ఉండే రిజర్వాయర్‌ను ఆకాశంలో దట్టమైన కారుమబ్బులు అలుముకొని కనువిందు చేశాయి. ఈ దృశ్యాలను సిద్దిపేట జిల్లా పరిధిలోని రంగనాయకసాగర్‌పై సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

–సాక్షి స్టాఫ్‌ఫొటో గ్రాఫర్, సిద్దిపేట

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలి
- సిద్దిపేట ఏసీపీ మధు



అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

నంగునూర్(సిద్దిపేట): సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట ఏసీపీ ఆధ్వర్యంలో నంగునూర్ మండల కేంద్రంలో ప్రత్యేక తనిఖీలు, అనంతరం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సరైన పత్రాలు లేని 44 మోటారు సైకిల్‌లు, ఒక ట్రాక్టర్‌లు సీజ్ చేశారు. అదే విధంగా బెల్ట్ షాపుల్లో లిక్కర్, బీర్ సీసాలను పట్టుకొని సీజ్ చేశారు. రూ.1,000 విలువ గల ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను పట్టుకొని కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మధు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల ద్వారా నేరుగా ప్రజలను కలిసి వారి సమస్యలను గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే, నిషేధ మత్తు పదార్థాలు, మద్యం గుట్కాలు విక్రయించినా వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు. నేను సైతం కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను కొనుగోలు చేయరాదని, ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్, రహదారి నియమాలు పాటించి, ప్రమాదాలను నివారించాలన్నారు. బాధితులు టోల్ ఫ్రీ నంబర్లు 1930, డయల్ 100కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, దుబ్బాక సీఐ శ్రీనివాస్, రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్, రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి, త్రీ టౌన్ ఎస్ఐ చంద్రం, పోలీస్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ దొంగలు అరెస్ట్



బైక్‌లు, నిందితులను చూపుతున్న పోలీసులు

వివరాలు వెల్లడించిన సీఐ స్వామి గౌడ్

పటాన్‌చెరు టౌన్: ద్విచక్ర వాహనాల దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన సోమవారం సాయంత్రం భానూర్ బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ స్వామి గౌడ్ కథనం మేరకు.. గతేడాది జూన్‌లో భానూరు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సంతోష్ గౌడ్ బైక్‌ను ఇంటి ఎదుట నిలుపగా గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లాలో ద్విచక్ర వాహనాల చోరీ కేసులు పెరుగుతుండటంతో సోమవారం ఎస్పీ రూపేష్, సౌత్ వెస్ట్ టాస్క్ ఫోర్స్ డీసీపీ ఆదేశాల మేరకు బీడీఎల్ పోలీసులు పటాన్‌చెరు మండలం ఘనపూర్ చౌరస్తాలో సీఐ స్వామి గౌడ్, సౌత్ వెస్ట్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్ఐ శరత్, ఎస్ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో కలిసి వాహన తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలు ఒప్పుకున్నారు. వెంటనే వారి వద్ద నుంచి బీడీఎల్ భానూరు, సంగారెడ్డి, సదాశివపేట, నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగిలించిన ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులు సికింద్రాబాద్‌కు చెందిన మహమ్మద్ షర్ఫుద్దీన్, గుడాల తిలక్, హైదరాబాద్ మల్లేపల్లికి చెందిన మొహమ్మద్, లంగర్ హౌస్‌కు చెందిన మహమ్మద్ అశ్రఫ్‌లతోపాటు మరో మైనర్‌ను రిమాండ్‌కి తరలించారు. సాజిత్, మొహ్మద్ రంజాన్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగ

కరెంట్ షాక్‌తో నక్క మృత్యువాత



ఝరాసంగం(జహీరాబాద్):విద్యుదాఘాతంతో నక్క మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని కక్కర్‌వాడ గ్రామం నుంచి కొల్లూర్ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగ మూడు రోజుల కిందట తెగిపడింది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో సోమవారం విద్యుత్ తీగ తగిలి నక్క మృత్యువాత పడింది. ఈ ఘటనతో అధికారుల తీరుపై గ్రామస్తులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తీగను సరి చేయాలని డిమాండ్ చేశారు.

చేతిలో పేలిన నాటు బాంబు

- పాడి గేదెను అడవిలో మేతకు తీసుకెళ్లిన రైతుకు తీవ్ర గాయాలు
- హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌లో ఘటన



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్

హుస్నాబాద్‌రూరల్: అడవిలో పాడి పశువులను మేతకు తీసుకెళ్లిన రైతు నాటు బాంబు పేలుళ్లకు గురై గాయపడ్డాడు. ఈ ఘటన హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రైతు ఖలీలుకు జిల్లెలగడ్డ, మీర్జాపూర్‌లో శివారుల మైసమ్మ గుట్ట కింద వ్యవసాయ భూమి ఉంది. పంటల సాగుతోపాటు పాడి గేదెలను పెంచుకొని పాల ఉత్పత్తి చేస్తున్నాడు. ఉదయం పాడి గేదెలను మేతకు అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి మేకులకు కట్టేస్తున్నాడు. ఇదే సమయంలో సమీపంలోని రాళ్లపై కనిపించిన నాటు బాంబును పరిశీలించే క్రమంలో చేతిలో పేలి వేళ్లు తెగిపడ్డాయి. తీవ్రంగా గాయపడ్డ ఖలీలు విషయాన్ని తన సోదరుడికి ఫోన్ ద్వారా చెప్పాడు. వెంటనే అతడు వచ్చి వరంగల్ ఎంజీఎంకు తరలించాడు. గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న ఎస్సై మహేశ్ మొదట అటవీ ప్రాంతానికి చేరుకొని ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. తర్వాత సీఐ శ్రీనివాస్, ఏసీపీ సతీష్ వచ్చి క్లూస్‌టీంను రప్పించి పరిసరాలను తనిఖీ చేయించారు. అడవి పందుల కోసం వేటగాళ్లు పెట్టి వదిలేసిన నాటు బాంబు రైతు ఖలీలు పరిశీలించే క్రమంలో పేలినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు: వెంకటేశం

వెల్దుర్తి(తూప్రాన్): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు, బదిలీలు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిందున సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం తెలిపారు. సోమవారం ఆయన వెల్దుర్తిలో మాట్లాడుతూ... రాష్ట్రంలోని వివిధ కేడర్లో పని చేస్తున్న 25 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినందుకు ఈనెల 2న ఉపాధ్యాయులతో ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ పాఠశాలకు స్కావెంజర్‌ను నియమిస్తామని హామీనిచ్చినట్లు తెలిపారు. ఆ హామీని నేడు కార్యరూపంగా ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు చేసి వాటి ద్వారా మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జింకా అశోక్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

యువకుడి మృతిపై అనుమానాలు

దర్యాప్తు చేయాలని మల్లుపల్లి గ్రామస్తుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మల్లుపల్లి గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు ఉదయ్ కిరణ్ మృతిపై అనుమానాలున్నాయని ఇందుకు కారణమైన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట మల్లుపల్లి గ్రామస్తులు రాస్తారోకో చేశారు. వివరాల్లోకి వెళ్తే .. మల్లుపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు ఇంటికి ఇల్లరికపు అల్లుడుగా వచ్చిన ఉదయ్ కిరణ్ స్థానిక డంప్‌యార్డులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. మృతిపై అనుమానాలు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఇల్లరికపు అల్లుడిని చిత్రహింసలకు గురిచేసి హత్యచేశారని, అనుమానం రాకుండా ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. మృతిపై ఎలాంటి అనుమానాలున్నా ఫిర్యాదు ఇస్తే దర్యాప్తు చేస్తామని పేట ఎస్ఐ నారాయణగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను సముదాయించారు. దీంతో రాస్తారోకో విరమించి అనుమానితుల పేర్లతో పోలీస్‌లకు మృతుడి తల్లి రాణి ఫిర్యాదు అందించారు. ఘటనను రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్ పర్యవేక్షించారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం



సంగారెడ్డి టౌన్: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన సంగారెడ్డి పట్టణ సీఐ భాస్కర్ తెలిపారు. పట్టణంలోని ప్రగతినగర్‌లో ఉంటున్న రాయికోడు మండలానికి చెందిన శ్రీలత బతుకుదెరువు కోసం సంగారెడ్డికి వచ్చి నివాసం ఉంటున్నారు. ఈనెల 4వ తేదీన భర్తతో గొడవ జరిగి ఇద్దరు పిల్లలతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించడం లేదు. భర్త వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 87126 61830 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య



రహీమ్ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలంలో చోటు చేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు.. సూరారం గ్రామానికి చెందిన మహ్మద్ రహీమ్(25) గ్యాస్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురై ఆదివారం మద్యం మత్తులో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫరియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేట ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

అందని ద్రాక్షే!



నిరుపయోగంగా మారిన హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనం

- నిరుపయోగంగా హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనం
- రూ.12.3 కోట్లతో కోహీర్ మండలంలోని కవేలి క్రాస్‌రోడ్డు వద్ద నిర్మాణం
- మూడేళ్లపాటు కొనసాగిన తరగతులు
- కరోనా మహమ్మారితో మూత
- గతేడాది తిరిగి దరఖాస్తుల స్వీకరణ
- సరైన సౌకర్యాలు లేక, పలు కారణాలతో అడ్మిషన్లు ఆలస్యం

జహీరాబాద్: నేటి తరం యువత తమ అభిరుచి మేరకు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులపై ఆసక్తి చూపుతున్నాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సైతం హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తుంది. గతేడాది కోహీర్ మండలంలోని కవేలి క్రాస్‌రోడ్డు వద్ద జ్యోతి బాపూలే మహిళా డిగ్రీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను ఏర్పాటు చేసింది. నిరుపేద విద్యార్థినులకు వృత్తి విద్య కోర్సులను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది అక్టోబర్‌లో అప్పటి మంత్రి హరీశ్‌రావు కవేలిలో ఎంజేపీ మహిళా డిగ్రీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను ప్రారంభించారు. సరైన సౌకర్యాలు లేక, పలు కారణాలతో మొదటి సంవత్సరం తరగతులను నిర్వహించలేదు. దీంతో హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినా అడ్మిషన్లు నోచుకోక కోర్సును అభ్యసించాలని ఆశతో ఉన్న వారికి నిరాశే కలుగుతోంది.

ఎంజేపీ సొసైటీకి అప్పగించనందుకే..

రాష్ట్ర హోటల్ మేనేజ్‌మెంట్ పరిధిలో ఉన్న భవనాన్ని ఎంజేపీ విద్యాలయానికి అప్పగించకపోవడం వల్లే ఇంటర్మీడియట్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివిన విద్యార్థినులు డిగ్రీ ప్రవేశాలను పొందలేక ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత సంవత్సరం తరగతులను నిర్వహించేందుకు మూడు నెలల కింద ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు ఇప్పటి వరకు అడ్మిషన్లు ఇవ్వడం లేదు. ఇందుకు కారణం హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనాన్ని జ్యోతి బాపూలే సొసైటీకి అప్పగించకపోవడమే. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం కల్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

మూతపడిన భవనం

నిరుపేద విద్యార్థులు, యువతకు వృత్తి విద్య కోర్సులను అందించి ఉపాధిని కల్పించాలనే ఉద్దేశ్యంతో 2012 సంవత్సరంలో అప్పటి మంత్రి జె.గీతారెడ్డి రూ.12.3 కోట్ల వ్యయంతో కోహీర్ మండలంలోని కవేలి క్రాస్‌రోడ్డు వద్ద రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కళాశాల భవనం పూర్తయ్యేంత వరకు తాత్కాలిక భవనంలో తరగతులను నిర్వహించారు. పలు కారణాల వల్ల భవన నిర్మాణంలో ఆలస్యం జరిగినా చివరకు 2017లో పూర్తి చేశారు. గతేడాది అక్టోబర్‌లో మంత్రి హరీశ్‌రావు కళాశాల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసి పలు రాష్ట్రాలకు చెందిన వారికి డిగ్రీ తరగతులను నిర్వహించారు. మూడేళ్ల పాటు కళాశాల సజావుగా కొనసాగింది. కరోనా సమయంలో కళాశాల మూతపడింది. అప్పటి నుంచి ప్రవేశాలు జరగలేదు. ఫలితంగా హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల భవనం నిరుపయోగంగా మారింది.